వైద్యరంగానికి అంకితభావంతో సేవ చేస్తా

మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జూన్ 14: తనకు దక్కిన వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్యవిద్యశాఖలకు అంకితభావంతో సేవ చేస్తానని మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ట్వీట్ చేశారు. మంత్రివర్గంలో కీలక శాఖలు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తనకు వైద్య, కుటుంబసంక్షేమం, వైద్యవిద్య శాఖలు దక్కడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. తనను నమ్మి ఎమ్మెల్యేని చేసిన ధర్మవరం నియోజకవర్గ ప్రజలే కాకుండా మంత్రిగా రాష్ట్ర ప్రజలకు సేవ చేస్తానన్నారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగు పరచడానికి కృషి చేస్తానన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, ఆస్పత్రుల్లో లోటుపాట్లను సరిదిద్ది, ప్రతి పేదవాడికి సర్కారీ వైద్యం అందేలా చేయడమే తన కర్తవ్యమని ఆయన ఉద్ఘాటించారు.


అటు వైద్యం.. ఇటు సంక్షేమం

చేనేతకు పూర్వ వైభవం

బీసీలకు ప్రత్యేక చట్టం: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 14: వైసీపీ పాలనలో కుదేలైన చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తానని మంత్రి సవిత పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం అమరావతిలో మంత్రులకు శాఖలు కేటాయించారు. పెనుకొండ ఎమ్మెల్యే సవితకు బీసీ సంక్షేమం, ఆర్థిక బలహీనవర్గాల సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖలు అప్పగించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. బీసీలను గౌరవించిన పార్టీ టీడీపీ అన్నారు. బీసీ మహిళ అయిన తనకు మంత్రిగా బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో 50శాతం ఉన్న బీసీలకు వైసీపీ పాలనలో జగన్మోహన్‌రెడ్డి మొండిచేయి చూపించారన్నారు. టీడీపీతోనే బీసీలకు న్యాయం చేకూరుతుందన్నారు. బీసీ వర్గాల విద్య, వ్యాపార, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీసీలకు ప్రత్యేక చట్టం త్వరలోనే కార్యాచరణ దాల్చుతుందన్నారు. జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్ల ద్వారా నిధులు కేటాయిస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధి, ఉన్నత చదువులకు చేదోడుగా నిలుస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, ప్రాంతాలవారీగా చేనేతల సమస్యలు తెలుసుకుని, వారికి పథకాలు వర్తింపజేస్తామన్నారు. తనకు కేటాయించిన శాఖల ద్వారా లబ్ధిదారులకు న్యాయం చేస్తానని మంత్రి ఉద్ఘాటించారు.





సవితకు బీసీ సంక్షేమం, ఆర్థిక బలహీన వర్గాల సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖలు... సత్యకుమార్‌కు వైద్యం, కుటుంబ సంక్షేమం, వైద్యవిద్య శాఖలు

- జిల్లా మంత్రులకు కీలక శాఖలు
- చేనేత రంగానికి పూర్వవైభవం
- పట్టాలెక్కనున్న వైద్య కళాశాల నిర్మాణం
- సర్వత్రా హర్షాతిరేకాలు

పుట్టపర్తి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో జిల్లాకు రెండు కీలక మంత్రిత్వ శాఖలు దక్కాయి. దీంతో జిల్లాకు మహర్దశ పట్టనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ఏర్పడిన మంత్రివర్గంలో సభ్యులకు శుక్రవారం శాఖలు కేటాయించారు. ధర్మవరం నుంచి గెలుపొందిన సత్యకుమార్ యాదవ్‌కు వైద్యం, కుటుంబ సంక్షేమం, వైద్యవిద్య శాఖలు దక్కగా, పెనుకొండ నుంచి గెలిచిన ఎస్ సవితకు బీసీ సంక్షేమం, ఆర్థిక బలహీన వర్గాల సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖలను కేటాయించారు. రాష్ట్ర మంత్రివర్గంలో జిల్లాకు రెండు మంత్రి పదవులు ఇవ్వడం, అవి కూడా కీలక శాఖలు కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో చేనేత, టెక్స్‌టైల్ రంగంపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లాలో ఉత్పత్తి చేసే చేనేత ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ధర్మవరం, ముద్దిరెడ్డిపల్లితోపాటు జిల్లా వ్యాప్తంగా చేనేత రంగం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. జిల్లాకు చేనేత మంత్రిత్వ శాఖను కేటాయించడంతో ఆ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో జిల్లాలో చేనేత రంగం అభివృద్ధి బాట పడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో బీసీలు అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సవితకు బీసీ సంక్షేమ శాఖను కేటాయించడంతో ఆ వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశిస్తున్నారు.

వైసీపీ పాలనలో నిర్వీర్యం

వైసీపీ ఐదేళ్ల పాలనలో చేనేత రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. ముడిసరుకుల ధరలు పెరగడం, చేనేత ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో చేనేత రంగం కుదేలైంది. నేతన్నలు తీవ్రంగా నష్టపోయారు. సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపేసింది. వెరసి చేనేతలు బతుకు భారమై, రుణ బాధలు భరించలేక చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. చేనేత రంగం దీనావస్థకు చేరుకున్న సమయంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం, జిల్లాకు చెందిన సవితకు ఆ శాఖను కేటాయించడంతో ఈ రంగానికి పూర్వవైభవం రానుందన్న ఆశాభావం ఆ వర్గాల్లో నెలకొంది. ఏళ్లగా ఎదురుచూస్తున్న చేనేత క్లస్టర్ సాకారమవుతుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.



అమలుకానున్న పథకాలు

గత టీడీపీ హయాంలో బీసీల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేసింది. కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసి, ఆ వర్గాల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించింది. సబ్సిడీపై వాహనాలు అందించి, ఎంతోమందికి జీవనోపాధి కల్పించింది. ఆదరణ పథకాన్ని అమలు చేసింది. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టింది. వైసీపీ అధికారం చేపట్టాక వాటన్నింటినీ అటకెక్కించింది. బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది. ఉన్న నిధులను సైతం లాగేసుకుంది. ఇతర పథకాలకు మళ్లించింది. దీంతో బీసీ వర్గాలు.. వైసీపీ పాలనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ బీసీ వర్గాల్లో ఆశలు రేకెత్తాయి. బీసీ సంక్షేమ శాఖను సవితకు కేటాయించడంతో సబ్సిడీపై రుణాలు, వాహనాలు, పనిముట్లు, సంక్షేమ పథకాలు అందుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఊపందుకోనున్న వైద్య కళాశాల పనులు

జిల్లాలో పెనుకొండ సమీపంలోని సీఫారం వద్ద గత ప్రభుత్వ హయాంలో వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధులు విడుదల చేయకపోవడంతో పదిశాతం పనులు కూడా పూర్తికాలేదు. 2025లో ప్రారంభిస్తామని వైసీపీ పాలకులు ప్రగల్భాలు పలికినా అమలుకు నోచుకోలేదు. వైద్య కళాశాల పనులు పూర్తిగా అటకెక్కాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడం, జల్లాకు వైద్య విద్య శాఖ కేటాయించడంతో వైద్య కళాశాల పనులు ఊపందుకోనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది, ఆధునిక వైద్యపరికరాల కొరత తీవ్రంగా ఉంది. వైద్య శాఖను సత్యకుమార్‌కు కేటాయించడంతో ఈ సమస్యలకు చెక్ పెట్టడంతోపాటు ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను కల్పించి, నాణ్యమైన వైద్యం అందించే దిశగా అడుగులు పడనున్నాయి. మొత్తంగా జిల్లాలో వైద్యం కుటుంబ సంక్షేమానికి రానున్న రోజుల్లో పెద్దపీట వేయనున్నారు.

గ్రామాల నుంచి పనుల మీద నిత్యం వేలాది మంది పట్టణాలకు వస్తుంటారు. ఒక్కోసారి సాయంత్రం వరకు కూడా ఉండాల్సి రావచ్చు. హోటల్‌లో భోజనం చేద్దామంటే వందల్లో ఖర్చవుతుంది. అంత ఖర్చు భారమనుకునేవారు నీళ్లు తాగి.. తిరిగి ఊరెళ్తుంటారు. పదో.. పాతికో పెట్టి చిరుతిండ్లు తిని అర్ధాకలితో ఇంటిముఖం పడుతుంటారు. పట్టణాల్లో కూడా కార్మికులు, చిన్నచిన్న పనులు చేసుకునేవారు భోజనానికి ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారి కోసం గత టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. రూ.5కే అల్పాహారం, భోజనం అందించేవారు. పేదల కడుపు నింపేవారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక అన్న క్యాంటీన్లను మూసేసింది. పేదల కడుపు కొట్టింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడంతో మళ్లీ అన్న క్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. పేదల ఆకలి తీర్చనున్నాయి.





అన్న క్యాంటీన్ వద్ద క్యూలో నిల్చున్న జనం (ఫైల్)

- తక్కువ ధరకే అల్పాహారం, భోజనం
- వైసీపీ హయాంలో మూసివేత
- కూటమి పగ్గాలు చేపట్టడంతో చిగురిస్తున్న ఆశలు
- పేదలకు తప్పనున్న ఆకలి బాధలు

రూ.5కే.. అన్నం..

తెరుచుకోనున్న అన్న క్యాంటీన్లు

ధర్మవరం, జూన్ 14: పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. గత టీడీపీ హయాంలో ప్రతిష్టాత్మకంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. కేవలం రూ.5కే టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించారు. వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే పేదలు, ఆటో కార్మికులు, వివిధ వ్యాపార సంస్థల్లో పనిచేసే వారిని అన్న క్యాంటీన్లు అమ్మలా అక్కున చేర్చుకుని, అన్నం పెట్టేవి. వాటికి పక్కా భవనాలను సైతం నిర్మించారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక వైఎస్ జగన్ పేదల పొట్ట కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను మూసివేయించారు. దీంతో పేదలు కడుపు మాడ్చుకోవాల్సి వచ్చింది. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ పేదల్లో ఆశలు చిగురించాయి. ఎన్నికల ప్రచారంలో కూడా అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు తెరచి పేదల ఆకలి తీరుస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో త్వరలోనే అన్న క్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. జిల్లాలో మొట్టమొదటి సారిగా హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ తన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 10వ తేదీన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. 2018లో పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో అన్నక్యాంటీన్లకు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారు. ధర్మవరంలో 2, హిందూపురం, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, మడకశిరలో ఒక్కొక్కటి చొప్పున నిర్మించారు. అన్న క్యాంటీన్‌లో రోజుకు దాదాపు 3వేల మందికి భోజనం, అల్పాహారం అందిస్తుండేవారు. పట్టుకేంద్రమైన ధర్మవరం పట్టణానికి రోజూ వివిధ పనుల నిమిత్తం వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇక్కడ హోటళ్లలో టిఫిన్ చేయాలంటే రూ.40, భోజనం చేయాలంటే రూ.60 వెచ్చించాల్సి వస్తోంది. అన్న క్యాంటీన్లు పేదలకు ఎంతగానో ఉపయోగపడేవి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి రూ.5కే టిఫిన్, భోజనం లభించేది. దీంతో కళాశాలలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సమయానికి ఇంటివద్ద నుంచి భోజనం తెచ్చుకోకపోతే అన్న క్యాంటీన్‌లో తినేవారు. రోజుకు ఒక్కో క్యాంటీన్‌లో అల్పాహారం 350 మంది, మధ్యాహ్నం, రాత్రి భోజనం 900 మంది చేసేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అన్నక్యాంటీన్లను మూసివేయడంతో ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మరికొన్ని ప్రాంతాల్లో సచివాలయాలుగా మార్చేశారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. దీంతో తక్కువ ధరకే టిఫిన్, భోజనం లభిస్తుందని పేదలు ఆశిస్తున్నారు.

హోటల్ భోజనం చేయలేం



ధర్మవరానికి మా ఊరు 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. పని నిమిత్తం తరచూ పట్టణానికి వస్తుంటాం. గతంలో అన్న క్యాంటీన్లలో కడుపునిండా అన్నం తినేవారం. అది కూడా రూ.5కే పెట్టేవారు. వైసీపీ వచ్చాక వాటిని మూసేయడంతో హోటల్‌లో టిఫిన్ రూ.40, భోజనం రూ.60 వెచ్చించి, తింటున్నాం.

- బాబు, బిల్వంపల్లి, ధర్మవరం మండలం

పేదల కడుపు నిండుతుంది



అన్న క్యాంటీన్లలో పేదలు కడుపునిండా అన్నం తినేవారు. వైసీపీ పుణ్యమా అని అన్నక్యాంటీన్లను మూసివేశారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు కడుపునిండా అన్నం దొరుకుతుంది.

- చెన్నయ్య, చిన్నూరు బత్తలపల్లి, ధర్మవరం మండలం



ప్రభుత్వాస్పత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం

భోజనం వడ్డిస్తున్న సిబ్బంది (ఫైల్)

జిల్లా గోదాముకు చేరిన పాఠ్యపుస్తకాలు



అరకొరగా పాఠ్యపుస్తకాల సరఫరా

8, 9, 10 తరగతులకు 14 మండలాలకే..
యూనిఫాం రెండింటికే..
కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

కొత్తచెరువు, జూన్ 14: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అరకొరగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సరఫరా అయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలు కొత్తచెరువులోని జిల్లా పుస్తకాల గోదాముకు సరఫరా అవుతున్నాయి. వాటిని విద్యాశాఖాధికారులు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ఎంఈఓలు... ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని 1 నుంచి 7 తరగతుల వారికి మూడు విడతల్లో అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయనీ, వాటిని విద్యార్థులకు 13వ తేదీ నుంచే అందజేస్తున్నామని డీఈఓ మీనాక్షి తెలిపారు. 8, 9, 10 తరగతులకు సంబంధించి 14 మండలాలకు పాఠ్యపుస్తకాలు విజయవాడ నుంచే నేరుగా జిల్లా పరిషత్ పాఠశాలలకు సరఫరా అవుతున్నాయన్నారు. 18 మండలాలకు పాఠ్యపుస్తకాలు సరఫరా కావాల్సి ఉందన్నారు. యూనిఫాం ప్రస్తుతం రెండు మండలాలకు మాత్రమే సరఫరా అయింది. షూస్ 5 మండలాలకు వచ్చాయి. మిగిలిన 27 మండలాలకు సరఫరా కావాల్సి ఉంది. ఈనెల 18వ తేదీలోగా పూర్తిస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ తెలిపారు. నోటు పుస్తకాలు, బెల్టులు, నిఘంటువులు పూర్తిస్థాయిలో సరఫరా అయ్యాయనీ, వాటిని విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. మిగిలినవి పంపిణీ చేస్తామని డీఈఓ వివరించారు. వైసీపీ పాలనలో పాఠ్యపుస్తకాలు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారనీ, కొత్త ప్రభుత్వంలోనైనా పూర్తిస్థాయిలో అందేనా అని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

తేలికపాటి వర్షం



పుట్టపర్తిరూరల్, జూన్ 14: జిల్లాలో పలుచోట్ల గురువారం రాత్రి తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా కదిరిలో 22.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాస్త్రవేత్తలు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సోమందేపల్లి 19.4, పుట్టపర్తి 9.6, ఓబుళదేవరచెరువు 8.2, గాండ్లపెంట 7.4, నల్లమాడ 6.6, నంబులపూలకుంట 4.4, చిలమత్తూరు 3.2, నల్లచెరువు 2.8, కొత్తచెరువు 2.4, మడకశిర 2.0, బుక్కపట్నంలో 1.4 మి.మీ. వర్షం కురిసినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

చేనేత రంగం అభివృద్ధికి సహకరించండి

కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రిని కోరిన సత్యకుమార్

ధర్మవరం, జూన్ 14: పట్టు కేంద్రం ధర్మవరంలో చేనేతల అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. ఈ విషయాన్ని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న సత్యకుమార్ యాదవ్‌కు కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఫోన్ ద్వారా శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో ఎన్నికల్లో చేనేతలు అండగా నిలిచి, గెలిపించారనీ, వారి రుణం తీర్చుకోవడానికి ధర్మవరంలో మార్కెటింగ్ వ్యవస్థ, టెక్స్‌టైల్స్ పార్క్, మెగా క్లస్టర్ మంజూరు చేసి పట్టుపరిశ్రమను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కేంద్రమంత్రిని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి చేనేత రంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చినట్లు సత్యకుమార్ వెల్లడించారు.

సాహో చంద్రబాబు..!



- తొలిసంతకంతో తీపికబురు
- ఎన్నికల ముందు నిరుద్యోగులకు డీఎస్సీ హామీ
- బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే అమలు
- మెగా డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సైన్
- రాష్ట్రంలో 16,347 పోస్టుల భర్తీకి శ్రీకారం
- అత్యధికంగా 7,725 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు
- జీవో 27 జారీ
- నిరుద్యోగుల్లో హర్షాతిరేకాలు



అనంతపురం విద్య, జూన్ 14: నిరుద్యోగుల గుండెల్లోని బాధలు చూశారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఐదేళ్లపాటు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన వారి ఆవేదన విన్నారు. మెగా డీఎస్సీ ఇస్తానంటూ... ఎన్నికల ముందు వాళ్లకు మాట ఇచ్చారు. మాట ఇచ్చినట్టుగానే తొలి సంతకం చేసి.. తీపి కబురు అందించారు. లక్షలాది మంది కళ్లలో ఆనందాన్ని చూశారు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసి, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నడుం బిగించారు. రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామంటూ భరోసా నింపారు. దీంతో ఐదేళ్లుగా పోస్టుల భర్తీ లేవన్న ఆవేదనలో, అయోమయంలో, ఆందోళనలో ఉన్న వేలాది మంది నిరుద్యోగులు, ఉపాధ్యాయ పోస్టు ఆశావహులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు రాకతో మళ్లీ ఉపాధ్యాయ పోస్టు భర్తీ ఖాయమనీ, ఈ దఫా ఉద్యోగం సంపాదిస్తామన్న ధీమాతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లూ ఊరించి... ఆశలపై నీళ్లు..

జగన్ ప్రభుత్వం ఐదేళ్లూ ఊరించి, లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది. 2019 ఎన్నికల ముందు.. వేలాది టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. మాట ఇచ్చారని నిరుద్యోగులు ఓటు వేశారు. అధికారంలోకి వచ్చిన జగన్... నిరుద్యోగులను ఏమాత్రం పట్టించుకోలేదు. ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ కొత్త నాటకానికి తెరతీశారు. కొత్త ఏడాది క్యాలెండర్‌లో పేజీలు మారుతున్నాయి కానీ... జగన్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంపై ఏ మాత్రం పట్టించుకోలేదు. నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నా... ఆందోళనలు చేసినా... బలవంతంగా కేసులు పెట్టడం, వాళ్ల ఆందోళనలను అణచివేయడం వంటి చర్యలకు దిగారు. ఐదేళ్లూ ఇలాగే నిరుద్యోగులపై నిరంకుశంగా వ్యవహరించారు. తీరా ఎన్నికల సమయం రానే వచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు.. మళ్లీ జగన్‌కు నిరుద్యోగుల ఓట్లు గుర్తుకొచ్చాయి. అప్పుడు ఉన్నఫలంగా ఆయనకు డీఎస్సీ గుర్తుకొచ్చింది. నిరుద్యోగులకు ఎక్కడలేని ప్రేమను ఒలకబోస్తూ... డీఎస్సీకి హడావుడిగా నోటిఫికేషన్ విడుదల చేశారు. 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు నిర్ణయించారు. నిరుద్యోగులు జగన్ మాయమాటలు నమ్మలేదు.

అడగకనే మాట ఇచ్చిన బాబు

నిరుద్యోగులు, ఉపాధ్యాయ ఉద్యోగార్థుల ఆవేదన విన్న చంద్రబాబు... వారు అడగకుండానే మాట ఇచ్చారు. ఎన్నికల ముందే నిరుద్యోగులకు భరోసా కల్పించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తొలిసంతకం చేస్తానంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు... రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న రోజునే తొలిసంతకంతో నిరుద్యోగులకు తీపి కబురు అందించారు. మెగా డీఎస్సీ అంటూ సంతకం చేసి, వారికి సంతోషాన్ని అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 16347 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. 7725 స్కూల్ అసిస్టెంట్, 6371 ఎస్‌జీటీ పోస్టులు, టీజీటీ 1781, పీటీజీ 286, ప్రిన్సిపాల్ 52, పీఈటీ పోస్టులు 132 భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. మెగా డీఎస్సీకి సంబంధించి జీవో 27 విడుదల చేసింది. దీంతో నిరుద్యోగులు, భావి గురువుల్లో ఆనందం నెలకొంది. తొలి సంతకంలో తీపి కబురు అందించారు అంటూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఉద్యోగం వస్తుందన్న నమ్మకం పెరిగింది



మాది చాబాల గ్రామం. బీఏ పూర్తయిన తర్వాత డీఎడ్ చేశా. 2022 నుంచి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా. గతంలో జగన్ ప్రభుత్వం టీచర్ పోస్టుల భర్తీపై ఆశించినస్థాయిలో దృష్టి పెట్టలేదు. నాతో పాటు చాలామంది నిరుద్యోగులు నిరుత్సాహపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట మేరకు 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేయడం ఆనందంగా ఉంది. మా లైఫ్ సెటిల్ అవుతుందని నమ్మకం ఏర్పడింది.

- విజయలక్ష్మి, డీఎస్సీ అభ్యర్థి, చాబాల, వజ్రకరూరు మండలం

ఆనందంగా ఉంది



నేను టీచర్ కావాలన్నది మా నాన్న కల. మాది తుగ్గలి. ఇంటర్ తర్వాత కర్నూలు ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఎడ్ పూర్తి చేశా. 2022 నుంచి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా. 2022లో టెట్ రాశా. 2024లో టెట్‌కు హాజరయ్యా. సీఎం అయిన వెంటనే చంద్రబాబు ఇచ్చిన మాట మేరకు తొలి సంతకం చేయడంతో హ్యాపీగా ఉంది. 16 వేలకుపైగా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా.

-తేజశ్విని, డీఎస్సీ అభ్యర్థి

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- నెలాఖరులోగా పంటరుణాల రెన్యువల్ పూర్తి చేయాలి
- వెంటనే రుణాల పంపిణీని ప్రారంభించండి
- ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగులకు సీఈఓ ఆదేశం



సీఈఓను అభినందిస్తున్న ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14: ఉమ్మడి జిల్లాలో రైతులను ఇబ్బంది పెట్టొద్దనీ, వెంటనే పంట రుణాల పంపిణీని పునరుద్ధరించాలని ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగులకు సీఈఓ సురేఖారాణి ఆదేశించారు. నెలాఖరులోగా పంట రుణాల రెన్యువల్ పూర్తి చేయాలన్నారు. స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం సీనియర్ మేనేజర్లు, అధికారులతో పంట రుణాల చెల్లింపులు, రెన్యువల్‌పై సీఈఓ సురేఖారాణి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. రైతులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 28 శాఖల్లో రూ.650 కోట్ల రైతు రుణాలను నెలాఖరులోపు రెన్యువల్ చేయాలని తెలిపారు. 15 రోజులుగా నిలిపివేసిన పంటరుణాల చెల్లింపులు పునరుద్ధరించాలని సూచించారు. డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు భరత్, సోమశేఖర్, నేతలు జానకిరామ్‌రెడ్డి, సుజాత, ఆర్‌వీ కృష్ణారెడ్డి, మేనేజర్లు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ దౌర్జన్యం



కమలపాడు ఆర్బీకేలో ఫ్యాన్ ఎత్తుకెళ్లిన దృశ్యం

యాడికి, జూన్ 14: మండలంలోని కమలపాడు ఆర్బీకేలో 6ఫ్యాన్లు, 7 లైట్లను అదే గ్రామానికి చెందిన వైసీపీ సోషల్‌మీడియా కన్వీనర్ ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని, అలా చేసేవారు ఎంతటివారినైనా ఉపేక్షించమని పోలీసులు హెచ్చరికలు జారీచేసినా వాటిని లెక్క చేయకుండా ఆయన రైతు భరోసా కేంద్రం తాళాన్ని పగలగొట్టి అందులోని ఫ్యాన్లు, లైట్లను ఎత్తుకెళ్లడం మండలవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. శుక్రవారం విధులకు వెళ్లిన ఆర్బీకే సిబ్బంది కార్యాలయానికి వెళ్లి చూస్తే తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూస్తే కార్యాలయంలో అమర్చిన ఫ్యాన్లు, లైట్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ సమాచారం గ్రామంలో హల్‌చల్ చేయడంతో అదే గ్రామానికి చెందిన వైసీపీ సోషల్‌మీడియా కన్వీనర్ ఎత్తుకొచ్చినట్లు బయటపడింది. ఈ విషయాన్ని ఆర్బీకే సిబ్బంది, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు విచారణ చేపట్టారు. ఫ్యాన్లు, లైట్లను ఎత్తుకెళ్లి విక్రయించడానికి సిద్ధం చేసిన కన్వీనర్ నుంచి వాటిని ఆర్బీకే సిబ్బందికి తిరిగి ఇప్పించారు. దీనిపై సీఐ నాగార్జునరెడ్డి వివరణ కోరగా ఆర్బీకేలో ఫ్యాన్లు, లైట్లు ఎత్తుకెళ్లిన మాట వాస్తవమేనని తెలిపారు. వాటిని తీసుకువెళ్లిన వ్యక్తి నుంచి తిరిగి ఆర్బీకే సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రైతు గవ్వల లక్ష్మన్న మృతదేహం

రాప్తాడు, జూన్ 14: మండలంలోని బోగినేపల్లి గ్రామానికి చెందిన రైతు గవ్వల లక్ష్మన్న (60) శుక్రవారం కనగానపల్లి మండలం తగరకుంట గ్రామ సమీపంలోని తన పొలంలో విద్యుదాఘాతంతో మరణించాడు. గవ్వల లక్ష్మన్న వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యవసాయ పని నిమిత్తం శుక్రవారం పొలానికి వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. లక్ష్మన్న ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య ఈశ్వరమ్మ పొలం వద్దకు వెళ్లింది. లక్ష్మన్న చనిపోయి ఉండటాన్ని గమనించి.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. లక్ష్మన్నకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా వారందరికీ వివాహాలు అయ్యాయి. కేసు దర్యాప్తులో ఉందని కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

నర్సరీల్లో విరివిగా మొక్కలు పెంచండి

- డీఎఫ్ఓలకు సీసీఎఫ్ నాగేశ్వరరావు ఆదేశం

అనంతపురం న్యూటౌన్, జూన్ 14: ప్రస్తుతం వర్షాలు బాగా వస్తున్నాయని, అందుకు అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు విరివిగా పెంచాలని అనంతపురం జిల్లా డీఎఫ్ఓ వినీత్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్ఓ రవీంద్రరెడ్డికు సీసీఎఫ్ నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన అనంతపురానికి వచ్చిన ఆయన సీసీఎఫ్ కార్యాలయంలోని తమ చాంబర్‌లో డీఎఫ్ఓలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. జిల్లాల్లో గ్రీనరీ పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా ఫీల్డ్ సిబ్బంది అలర్ట్‌గా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆయన చిత్తూరు జిల్లా, అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఉద్యోగోన్నతులకు సంబంధించిన ఫైల్ పరిశీలించినట్లు తెలిసింది.

విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 14: జిల్లాలోని ఆర్బీకేల్లో 18వ రోజైన శుక్రవారం విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటిదాకా 78,018 మంది రైతులకు 70,619 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటిదాకా 82,022 మంది రైతులు 72,395 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి: ఎస్పీ



ముస్లిం మత పెద్దలతో ఎస్పీ

అనంతపురం క్రైం, జూన్ 14: బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ గౌతమి శిషాలి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో బక్రీద్ నేపథ్యంలో ముస్లిం మత పెద్దలు, పోలీస్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య వచ్చినా పోలీస్ అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ టీవీవీ ప్రతాప్, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, సీఐలు క్రాంతి కుమార్, ధరణికిషోర్, ప్రతాప్‌రెడ్డి, ఆర్ఎస్ఐ జాఫర్ పాల్గొన్నారు.

కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూన్ 14: కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సులకు ఈ నెల 24 లోగా దరకాస్తులు చేసుకోవాలని సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆఫీస్ ఆటోమేషన్, పీసీ మెయింటెనెన్స్ అండ్ ట్రబుల్ షూటింగ్, ఆటో కాడ్, క్రాఫ్ట్ కోర్సులైన యోగా, బ్యూటిషియన్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. నెలరోజులపాటు ఈ శిక్షణ ఇస్తామని, జూన్ నుంచి ఆగస్టు వరకూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సెప్టెంబరు లేదా అక్టోబరులో పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఏపీ స్టేట్ (ఎస్‌బీటీఈటీ) ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, ఆపై విద్యార్హతలున్న వారు కోర్సులకు దరకాస్తు చేయడానికి అర్హులన్నారు. వివరాలకు 9059723829, 98857 38299 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్కాలర్‌షిప్ రెన్యువల్ చేసుకోండి

కొత్తచెరువు, జూన్14: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 2019-20, 2021-22 విద్యా సంవత్సరాల్లో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రెన్యువల్ చేసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మీనాక్షి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆయా సంవత్సరాల్లో 9, 10, 11, 12 తరగతులు చదివిన విద్యార్థులు రెన్యువల్ చేసుకున్నప్పటికీ స్కాలర్‌షిప్ అందకపోతే ఆధార్‌కార్డును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాలో డబ్బు జమకాని విద్యార్థుల జాబితాను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఆ జాబితాలో పేరు ఉన్న విద్యార్థులు త్వరగా బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకుని, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నగదు జమయ్యేవిధంగా ఏర్పాటు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

చీనీకాయలు టన్ను రూ.35 వేలు

అనంతపురంరూరల్, జూన్ 14: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.35 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.22 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 622 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వైసీపీ నాయకుల కక్షసాధింపు..!

- 544-డీ జాతీయ రహదారి నిర్వాసితులకు అందని పరిహారం
- రెండేళ్లుగా ఎదురుచూపులు
- వైసీపీ నాయకులకు అందలం
- నిరుపేదలకు మొండిచెయ్యి
- సీఎం చంద్రబాబుపైనే ఆశలు

బుక్కరాయసముద్రం, జూన్ 14: వైసీపీ పాలకుల కక్ష్య సాధింపుతో 47 కుటుంబాలు వీధిన పడ్డాయి. రెండు సంవత్సరాల నుంచి అదిగో.. పరిహారం.. ఇదిగో పరిహారం.. అన్న మాటే కానీ... మంజూరు అయ్యింది లేదు. ఈ గ్రామంలోని బాధితులంతా నియోజకవర్గంలోని వైసీపీ నేత వద్దకు పోలేదని అక్కసుతో రోడ్డు నిర్వాసితులకు పరిహారం రాకుండా నిలుపు దల చేయించినట్లు ఆరోపణలున్నాయి. అనంతపురం రూరల్ పరిధిలోని పాముదాయి గ్రామం నుంచి బుగ్గ వరుకు 544 డి జాతీయ రహదారి నాలుగు లేన్ల రోడ్డు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆ గ్రామానికి చెందిన 135 గృహాలు తొలగించాల్సి ఉంది. ఇందులో అధికార పార్టీకి చెందిన నాయకుల ఇళ్లకు పరిహారం ఎక్కువ రాయించుకున్నారు. నిజమైన పేదలకు చెందిన 47 ఇళ్లకు రూ.2.50 కోట్లు సొమ్ము రాకుండా అప్పట్లో నియోజకవర్గం వైసీపీ నాయకులు అడ్డుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. గ్రామంలో వైసీపీ నాయకుడి వద్దకు వెళ్లిన 88 కుటుంబాలకు రూ.4.44 కోట్ల పరిహారం వచ్చింది. మిగిలిన వారికి పరిహారం ఇచ్చే విషయంలో రెండు సంవత్సరాలుగా రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ వచ్చారు. పరిహారం ఇవ్వాలని తహసీల్దార్, ఆర్అండ్‌బీ కార్యాలయాల చుట్టు రోడ్డు నిర్వాసితుల కాళ్లు అరిగేలా తిరిగినా వారు స్పందించలేదు. పరిహారం విషయంపై ఎలాంటి సమాధానం చెప్పకుండా దాటేస్తూ వచ్చారు.



పరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యేకి విన్నవిస్తున్న గ్రామ ప్రజలు

ఎందుకిలా..!

రోటరీపురం గ్రామంలోని సర్వే నెంబర్‌లో 112-2లో గత 43 సంవత్సరాలుగా 47 పేద కుటుంబాలు నివాసముంటున్నాయి. రెవెన్యూ రికార్డులో ఈ సర్వేనెంబరు రాళ్ల గుట్టగా నమోదు అయ్యింది. 1983లోనే పేదలకు అప్పటి ప్రభుత్వం ఇంటిపట్టాలు మంజూరు చేసింది. రెవెన్యూ అధికారులు పరిహారం పంచే విషయంలో వాస్తవ పరిస్థితి ప్రకారంగా నివేదిక పంపడంలో అలసత్వం వహించారు. ఈ సర్వేనెంబరులో ఎలాంటి నిర్మాణాలు లేవని రెవెన్యూ అధికారులు అప్పట్లో నివేదిక పంపారు. దీంతో ప్రజలకు అందాల్సిన పరిహారం మంజూరు కాలేదు. పరిహారం రాలేదని గ్రామంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను అప్పట్లో బాధితులు అడ్డుకున్నారు. అప్పటి జాయింట్ కలెక్టర్, రెవెన్యూ, అర్అండ్‌బీ అధికారులు మరో సారి పరిహారం అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

పేదలకు తగ్గించి... వైసీపీ నేతలకు పరిహారం పెంపు

గ్రామంలో రోడ్డు నిర్వాసితులకు రావాల్సిన పరిహారం విభజించుపాలించు అన్న చందంగా ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు నివేదికలు పంపారు. టీడీపీ మద్దతు దారుల అన్న కక్షతో 47 కుటుంబాలకు పరిహారం నగదును ప్రతి ఇంటికి తగ్గించారు. తగ్గించిన ఆ పరిహారం నగదును వైసీపీ నేతలకు పంచినట్లు బాధితులు పరిహారంలో భారీ అవినీతి జరిగిందని, వెంటనే రోడ్డు నిర్వాసితుల పరిహారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



రోటరీపురం గ్రామ రోడ్డు (ఫైల్)

కలెక్టర్ వద్ద ఆగిన ఫైల్..!

రోడ్డు నిర్వాసితుల పరిహారం ఫైల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే ఆగిపోయింది. బాధితులకు పరిహారం ఇవ్వకుండా గతంలో వైసీపీ నేతలు అడ్డుకోవడంతో వీటికి సంబంధించిన ఫైల్ కలెక్టర్ కార్యాలయంలోనే నిలిచిపోయింది. బాధితుల పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపకుండా కాలయాపన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో సీఎం చంద్రబాబు నాయుడుపై బాధితులు పరిహారం అందుతుందనే ఆశాభావంతో ఉన్నారు. ఈవిషయమై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని గ్రామ ప్రజలు కలిసి విన్నవించారు. త్వరలోనే కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారిస్తామని రోటరీపురం గ్రామ ప్రజలకు, టీడీపీ నేతలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వైసీపీ కక్ష సాధింపు



రోడ్డు విస్తరణలో నా ఇల్లు పూర్తిగా పోయింది. ఇంటి నిర్మాణం చేపట్టి నాలుగు సంవత్సరాలు కూడా కాలేదు. ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షలుపైగా ఖర్చు చేశా. ప్రస్తుతం ప్రభుత్వం రూ.23 లక్షలు పరిహారం ఇస్తోంది. ఇంత తక్కువ పరిహారం రావడానికి వైసీపీ నాయకులే కారణం ఇప్పటికైనా సీఎం చంద్రబాబునాయుడు స్పందించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నా. -తరిపోగల వెంకటనాయుడు

పరిహారం కోసం ఎదురుచూపులు



పరిహారం కోసం రెండు సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్నాం. కేవలం వైసీపీ నేతలు, కార్యకర్తలకే పరిహారం ఇచ్చారు. గ్రామంలో సామాన్య పేద ప్రజలకు వైసీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పరిహారం ఇవ్వలేదు. స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వెంటనే చొరవ చూపి న్యాయం చేయాలి. - రాజగోపాల్, కిరాణా వ్యాపారి

బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- లోన్‌యాప్‌లో చేసిన అప్పులు తీర్చేందుకే చోరీ
- ఆ ఇంట్లో వుడ్‌వర్క్ చేసిన యువకుడే నిందితుడు

అనంతపురం క్రైం, జూన్14: నగరంలోని భవానీనగర్‌లో చోరీ కేసును వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. చంద్రమోహన్‌రెడ్డి ఇంట్లో 30 తులాల బంగారు నగలు చోరీ అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో వన్‌టౌన్ పోలీసులు షేక్ ఖాజాపీర్ అలియాస్ షారుఖ్‌ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రెడ్డప్పతో కలిసి డీఎస్పీ ప్రతాప్.. కేసు ఛేదింపు వివరాలు వెల్లడించారు.

లోన్‌యాప్ అప్పులు తీర్చడానికి..

అనంతపురం రూరల్ మండలం నందమూరినగర్‌కు చెందిన షేక్ ఖాజాపీర్ ఇళ్లలో ఉడ్‌వర్క్ చేసేవాడు. లోన్‌యాప్‌ల నుంచి రూ.1.30 లక్షల వరకు అప్పు చేశాడు. వాటి నుంచి ఒత్తిళ్లు రావడంతో చోరీ చేయాలని భావించాడు. రెండు నెలల క్రితం భవానీనగర్‌లోని చంద్రమోహన్‌రెడ్డి ఇంట్లో వుడ్‌వర్క్ చేశాడు. అందులో భాగంగా వార్డ్‌రోబ్‌లో సీక్రెట్ అల్మరా లాంటి క్యాష్ కప్‌బోర్డు చేయించాడు. ఈనెల 13న చంద్రమోహన్‌రెడ్డి దంపతులు కమలానగర్‌లో తాము నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ షాపునకు వెళ్లారు. అదే సమయంలో ఇంటి వద్ద కాపుకాసిన ఖాజా.. ఆ దంపతులు దుకాణానికి వెళ్లగానే బైక్‌ను దూరంగా ఉంచి ఇంటికి వెళ్లాడు. మాస్క్ ధరించి ఇంటి తలుపుకున్న బోల్ట్ వెండి, తలుపు పక్కనే ఉన్న కిటికీ అద్దం పగలకొట్టాడు. షెల్ఫ్‌లోని చిన్న కప్‌బోర్డులో ఉంచిన 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరించాడు. ఆ బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టేందుకు సిద్ధమవుతుండగా.. పోలీసులకు సమాచారం రావడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. 30 తులాల బంగారు నగలు, రూ.37,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో వన్‌టౌన్, ఫోర్త్‌టౌన్ సీఐలు రెడ్డప్ప, ప్రతాపరెడ్డి, ఏఎస్ఐ నాగేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు దాస్, ఆసిఫ్, మహమ్మద్, మురళీధర్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగలను పరిశీలిస్తున్న పోలీసులు

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ధర్మవరం, జూన్ 14: ఈ నెల 22వ తేదీన పౌర్ణమి సందర్భంగా ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు డిపోమేనేజర్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం గిరిప్రదక్షిణతో పాటు కాణిపాకానికి బస్సు నడుపుతామన్నారు. ఈనెల 21న ఉదయం 6గంటలకే బస్సు బయలుదేరుతుందన్నారు. రానుపోను చార్జీ ఒక్కొక్కరికి రూ.1400 ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు బస్సు కౌంటర్‌లోకానీ ఆన్‌లైన్‌లో కానీ సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 6303151302, 9959225859 నంబర్లలో సంసంప్రదించాలని సూచించారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

ముదిగుబ్బ, జూన్14: హిందువులు పవిత్రంగా ప్రేమించే గోవులను పలువురు అక్రమంగా రవాణా చేస్తున్నారని, వాటిని అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు శుక్రవారం మండలకేంద్రంలో సీఐ యతీంద్రను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ గోవులను కొంతమంది అక్రమంగా లారీలలో కబేళాలకు తరలిస్తున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ మాట్లాడుతూ పశువుల విక్రయం, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమల ప్రకాష్, కేశవ, పవన్, పసుపులేటి వెంకటేష్, ఫణికుమార్, ప్రసాద్, నారాయణ, బాబు, సోమశేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం


విలేకరులతో మాట్లాడుతున్న రేగాటిపల్లి వరదరాజులు

ధర్మవరం, జూన్ 14: దివ్యాంగులకు పింఛన్‌ను నెలకు రూ.6వేలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన చంద్రబాబు సీఎం అవగానే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని టీడీపీ ఎస్సీ సెల్ ధర్మవరం మండల అధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయవాడలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన చంద్రబాబును ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అధికారంలోకి వచ్చాక దివ్యాంగులకు రూ.3వేలు నుంచి రూ.6వేలకు పింఛన్‌ను పెంచాలని కోరడంతో వెంటనే ఆయన హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే దివ్యాంగులకు రూ.6వేలు పెంచుతూ జీఓ విడుదల చేయడం హర్షణీయమన్నారు.

రక్తదానంతో ప్రాణదానం: నిమ్మల

గోరంట్ల, జూన్ 14: రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం కాపాడిన వారవుతారని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప పేర్కొన్నారు. గోరంట్లకు చెందిన ది వాకర్, వార్డు మాజీ సభ్యుడు నాగరాజు, శివకుమార్ శుక్రవారం ప్రపంచ రక్తదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన నిమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగావకాశాలను పెంపున కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టారన్నారు. మాజీ మంత్రి రామచంద్రారెడ్డి మాదిరిగానే ఆయన కుమార్తె సవిత మంత్రి గా మంచి పేరు తెచ్చుకుంటారని నిమ్మల అభిప్రాయపడ్డారు. శిబిరంలో 110మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, టీడీపీ నాయకులు నిమ్మల చంద్రశేఖర్, బాలక్రిష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఏకాగ్రత అవసరం

పుట్టపర్తి, జూన్ 14: విధినిర్వహణలో ఉన్న డ్రైవర్లకు ఏకాగ్రత చాలా అవసరమని ప్రజారవాణాశాఖాధికారి మధుసూదన్ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన డ్రైవర్లకు, కండెక్టర్లకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. వాహనం నడిపేటప్పుడు ప్రశాంతంగా ఉండాలన్నారు. ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలన్నారు. అప్పుడే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను విడుదల చేశారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 14: తలుపుల మండలం గంజివారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కౌలు రైతు గంగాద్రి(45) గత సోమవారం పొలంలో పనిచేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం గంజికుంటపల్లికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తలుపుల మాజీ ఎంపీపీ మనోహర్‌రెడ్డి, వేపమానిపేట సర్పంచ్ మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

నల్లచెరువు, జూన్ 14: మండలంలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీ సున్నపుపల్లివాండ్లపల్లిలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన నారాయణప్ప ఆవును తన బోరు బావి వద్ద మేత కోసం వదిలాడు. ఆవు విద్యుత్ మేత మేస్తుండగా అక్కడే ఉన్న స్తంభానికి సమీపంలోకి వెళ్లింది. అయితే స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురై మృతిచెందింది. స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతోందని సంబంధితాధికారులకు పలుమార్లు తెలిపానని, ఎవరూ పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. ఆవు మరణించడంతో దాదాపు రూ.70వేలు నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రహదారికి మరమ్మతులు

నల్లచెరువు, జూన్ 14: మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు వివిధప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారికి మండలకేంద్రానికి చెందిన సుబహాన్ శుక్రవారం మరమ్మతులు చేయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రంథాలయాలకు వెళ్లే రహదారి వర్షపు నీటితో కోతకు గురైంది. దీంతో వాహనాలు వెళ్లడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. ఇందుకు స్పందించిన స్థానికుడు సుబహాన్ సొంత ఖర్చులతో మట్టిని తోలించి రహదారికి మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో అధికారులు, వాహనదారులు, ప్రజలు ఆయన్ని అభినందించారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ చేయిస్తాం

● ఎమ్మెల్యే కందికుంట


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, జూన్ 14: కదిరి మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలపై విచారణ చేయిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్‌లో దాదాపు 743 ఇళ్లకు అక్రమంగా ప్లానింగ్ ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గృహయజమానులతో పెద్దఎత్తున మున్సిపాలిటీలోని పాలకులు డబ్బులు తీసుకున్నట్లు తమ విచారణలో తెలిసిందన్నారు. వీటిపై సమగ్ర విచారణను విజిలెన్స్‌కు అప్పగిస్తామన్నారు. అలాగే కదిరి-రాయచోటి రోడ్డును మూడు నెలల్లో మరమ్మతులు చేయిస్తామన్నారు. పాత కాంట్రాక్టర్ పనులు రద్దు చేశామని, ఆయనకు రావాల్సిన బిల్లులు చెల్లించి, పనులు మొదలు పెడతామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఐదు పథకాలపై సంతకాలు పెట్టారని, అవన్నీ ప్రజలకు ఎంతో ఉపయోగపడేవని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు గంగయ్యనాయుడు, రాజశేఖర్‌బాబు, నరసారెడ్డి, తలుపుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై మాట నిలుపుకున్న చంద్రబాబు

● తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ధర్మవరంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థినులు, తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ధర్మవరంరూరల్, జూన్ 14: ఎన్నికలకు ముందు ప్రజాగళం యాత్రలో చంద్రబాబు అధికారంలోకి రాగానే నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీపై తొలిసంతకం చేస్తానని మాట ఇచ్చారని, ఇప్పుడు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రిగా తొలిసంతకం మెగా డీఎస్సీ విడుదల కోసం చేశారని తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కొనియాడారు. పట్టణంలోని కళాజ్యోతిసర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం వారు విద్యార్థినులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇచ్చిన మాట నిలుపుకున్నందుకు థ్యాంక్యూ సీఎంసార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర అధికారప్రతినిధి చిన్నూరు విజయ్‌చౌదరి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఇర్షాద్, నియోజకవర్గ అధికారప్రతినిధి అమరా సుధాకర్, నాయకులు అడ్రమహేష్, అశోక్‌వాల్మీకి, చిన్న, ఆది, ఎన్‌బీకే హరి, వినోద్, సురేష్, పవన్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై సంతకం చేసి మాట నిలపెట్టుకున్నారని ఏపీటీఎఫ్ 257 ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి. రామ్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీపై మొదట సంతకం పెట్టి నిరుద్యోగులకు ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలుపుకున్నారని కొనియాడారు. విద్యాశాఖమంత్రిగా నారా లోకేష్‌ను నియమించినందుకు హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖకు గుదిబండగా మారిన 117 జీవోను కూడా రద్దు చేయాలని కోరారు. బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై ఉద్యోగుల హర్షం

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలిసంతకం చేయడం హర్షణీయమంటూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలోని ఉద్యోగసంఘం జిల్లాకార్యాలయంలో వారు సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికసంఘం సమస్యల పట్ల వివక్ష చూపిందన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్‌లు, బకాయిల చెల్లింపుల్లో తీవ్ర అలసత్వం చేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తోడ్పాటు అందిస్తుందని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఉద్యోగ సంఘం నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, బీవీ రమణ, మల్లికార్జున, చంద్రకళ, చంద్రానాయక్, లక్ష్మయ్య, రమణారెడ్డి, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యాలు భరించలేకే ప్రజలు ఓడించారు..

● ఈవీఎంలపై నిందలు సరికాదు
● మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై బీజేపీ నాయకుల ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాకేఓబులేశు

ధర్మవరం, జూన్ 14: మీ అవినీతిని, అక్రమాలను, దౌర్జన్యాలను భరించలేక విసుగు చెందిన ప్రజలు ఎన్నికల్లో మిమ్మల్ని ఘోరంగా ఓడించారని, అంతేకానీ ఈవీఎంలలో ఎలాంటి పొరబాట్లు జరగలేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబుళేశు, జింకాచంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ గోపాలరెడ్డి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై విరుచుకుపడ్డారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సోషల్‌మీడియాలో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని, అందుకే ఓడిపోయామని వ్యాఖ్యలు చేయడాన్ని వారు తప్పుబట్టారు. రాష్ట్రంలో జగన్, ధర్మవరంలో కేతిరెడ్డి అరాచకాలను ప్రజలు భరించలేకపోయారన్నారు. అందుకే ఓటుతో ఏకపక్షంగా బుద్ధి చెప్పారన్నారు. కేతిరెడ్డి తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఈవీఎంలపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఇది అతడి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ 151సీట్లు సాధించిందని, అప్పుడు మేము ఈవీఎంల టాంపరింగ్ జరిగిందని అనాలా? అని ప్రశ్నించారు. విషయ పరిజ్ఞానం ఉంటే ఇలాంటి వ్యాఖ్యలు చేయరని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండా పుల్లయ్య, కొత్తకోట రవీంద్రారెడ్డి, జల్లాకార్తీక్, పుట్లూరు నబీరసూల్, నరసింహులు, రాధమ్మ, మహాలక్ష్మి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు హర్షణీయం


ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు


కదిరిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం ..

ధర్మవరం, జూన్ 14: ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేయడం హర్షణీయమని ధర్మవరం బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలోని కోర్టు ఆవరణలో గల బార్ అసోసియేషన్ చాంబర్‌లో న్యాయవాదులతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకురావాలని విశ్వప్రయత్నాలు చేసిందన్నారు. దీనిని అన్ని వర్గాల ప్రజలు, న్యాయవాదులు వ్యతిరేకించామన్నారు. అయితే చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారన్నారు. ఆ మాట ప్రకారం ఇప్పుడు ఆ చట్టాన్ని రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు క్రిష్ణమోహన్, దుర్గాప్రసాద్, రహంతుల్లా, చౌదరి, బిల్లేరవి, గోపీక్రిష్ణ, గుంటప్ప, అబ్దుల్లా, నల్లప్ప, రామానాయుడు, భాస్కర్, మోహన్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కదిరిలీగల్: సీఎం చంద్రబాబు ల్యాండ్‌టైటిలింగ్ యాక్టు రద్దుచేయడం పట్ల పట్టణంలో న్యాయవాదులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక న్యాయవాదుల కార్యాలయంలో శుక్రవారం వారు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ రద్దుచేయాలని న్యాయవాదుల సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు నిరసనలు చేపట్టామని, అయినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. కాగా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్‌ను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, నాగశేషయ్య, చౌడప్ప, నాగేంద్రప్రసాద్, రవీంద్ర, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో అనారోగ్యం

నల్లమాడ, జూన్ 14: మండలంలోని రెడ్డిపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యుడు గణేనాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. పొగాకు వద్దు జీవితమే ముద్దు అని, పొగ తాగకు, క్యాన్సర్‌కు గురికాకు అని నినాదాలు చేశారు. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వైద్యుడు వివరించారు. కావున పొగాకు అలవాటు ఉన్నవారు వెంటనే మానుకోవాలని సూచించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. డీసీఎం త్రిలోక్‌నాథ్, సీహెచ్ఓ రామాంజులు, సూపర్‌వైజర్లు మంజుల, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశకార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీజీని కలిసిన ధర్మవరం బీజేపీ నాయకులు

ధర్మవరం, జూన్ 14: రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌ను పట్టణానికి చెందిన బీజేపీ జాతీయ సభ్యులు అంబటి సతీశ్‌కుమార్, సత్యసాయి జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ బాలక్రిష్ణయాదవ్ శుక్రవారం విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి భరత్‌కు వారు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

పలు గ్రామాల్లో 'అంగన్‌వాడీ పిలుస్తోంది'


కోటపల్లిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు

తనకల్లు, జూన్ 14: మండలంలోని కోటపల్లి 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, సాయిలక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం అంగన్‌వాడీల ముఖ్య ధ్యేయమన్నారు. 3 ఏళ్ల వయసు గల పిల్లల పేర్లను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేస్తామన్నారు. అనంతరం కాన్వెంట్లు వద్దు అంగన్‌వాడీలు ముద్దు అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది రా అంటూ నినాదాలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈకార్యక్రమం కొనసాగించినట్లు సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ తెలిపారు.

17నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు


ఆహ్వానపత్రికలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

ధర్మవరం రూరల్, జూన్14: మండలంలోని పోతుకుంట గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యు లు తెలిపారు. ఈ మేరకు ఆహ్వానపత్రికలను శుక్రవారం వారు భక్తులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఏటా తొలిఏకాదశిని పురస్కరించుకుని గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 17న సాయంత్రం 5గంటలకు స్వామివారి గుట్ట వద్దకు వెళ్తామని, అక్కడ స్వామివారి ఉత్సవ విగ్రహాలకు గంగపూజ చేసిన అనంతరం పల్లకిలో ఊరేగింపు చేస్తామని అన్నారు. 18న నాగదేవతలకు పూజలు, దాసంగాలు, అన్నదానం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

బాల్యవివాహాల నియంత్రణకు కృషి చేయాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

కదిరిఅర్బన్, జూన్ 14: బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి అధ్యక్షతన బాల్యవివాహాల నివారణపై డివిజన్‌లోని మండలస్థాయి అధికారులతో సమావేశం జరిగింది. ఇందులో ఆర్డీఓ, డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ముందుగా వారు బాల్యవివాహాల నివారణకు సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎక్కువగా జరిగే మండలాలు, గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలకు వాటి నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. వాటి వల్ల కలిగే నష్టాలు, అనారోగ్య సమస్యల గురించి వివరించాలన్నానరు. ప్రస్తుతం సమాజం ఎంతో అభివృద్ధి చెందుతున్నా బాల్యవివాహాలు జరుగుతుండడం దురదృష్టకరమన్నారు. ఇకపై జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఐసీడీఎస్ సీడీపీఓలు, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ


ఆరోగ్యకేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి నాగేంద్రనాయక్

పుట్టపర్తి రూరల్, జూన్ 14: జిల్లాకేంద్రంలోని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడ అందించే వ్యాధినిరోధక టీకాలు, అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ గురించి విచారించారు. వ్యాక్సిన్లను నిల్వ చేసే ఫ్రిడ్జ్‌లను పరిశీలించారు. తర్వాత చికిత్స నిమిత్తం వచ్చిన రోగులకు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల క్షయవ్యాధి శాశ్వతంగా నిర్మూలన అవుతుందన్నారు. ఇందులో ఐదేళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయినవారు, అరవైఏళ్ల వయసు నిండిన వారు, పొగ తాగేవారు, షుగర్ ఉన్నవారు, ఎత్తుకు తగిన బరువు లేనివారు తప్పకుండా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ప్రతిశుక్రవారం డ్రైడే పాటించి దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జ్యోత్స్న, సీహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరణ, రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే వందశాతం పుస్తకాల పంపిణీ


ఎమ్మార్సీకి చేరుకున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు

పుట్టపర్తి రూరల్, జూన్ 14: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు త్వరలోనే వంద శాతం పాఠ్య, నోటు పుస్తకాల తో పాటు ఇతర బోధనా సామగ్రిని పంపిణీచేస్తామని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మార్సీలో రెండో విడత చేరిన పుస్తకాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలవ్యాప్తంగా 37 ప్రాథమికపాఠశాలలు 37, ఒక ప్రాథమికోన్నతపాఠశాల, 10 ఉన్నతపాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ఈ ఏడాది 1 నుంచి 10వ తరగతి వరకు 3,985 మంది విద్యార్థులు విద్యను అభ్యసించనున్నారు. మొదటి విడతలో ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు 11,500 పాఠ్య పుస్తకాలు, 25,764 నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. రెండో విడత పాఠ్య పుస్తకాలు, షూలు, బెల్టులు ఎమ్మార్సీకి చేరాయని, వాటిని సత్వరమే ఆయా పాఠశాలలకు పంపిణీ చేసి వెంటనే విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

హిందూపురం, జూన్ 14: తూమకుంట పారిశ్రామికవాడలోని రోల్‌వెల్ పరిశ్రమలో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ(43)అనే కాంట్రాక్ట్ కార్మికుడు అనుమానా స్పద స్థితిలో గురువారం రాత్రి మృతిచెందినట్లు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. హిందూపురం మండలం చౌళూరుకు చెందిన లక్ష్మీనారాయణ అనే కాం ట్రాక్ట్ కార్మికుడు గురువారం రాత్రి పరిశ్రమలో పనిచేయ డానికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో మూత్రవిసర్జనకు బయటకు వచ్చాడు. అక్కడే కుప్పకూలి పడిపోయాడు. కొద్దిసేపటి తరువాత తోటి కార్మికులు గమనించారు. కానీ అప్పటికే అతడు మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య గంగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే భర్త అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంపై భార్యతో పాటు కుటుంబ సభ్యులు పరిశ్రమవద్ద ఆందోళన చేప ట్టారు. కానీ మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. దీ నిపై సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని తెలిపారు.

కేజీబీవీని పరిశీలించిన ఎమ్మెల్యే కందికుంట


కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి, జూన్ 14: తలుపుల మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని, సక్రమంగా విద్య బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పేద పిల్లలు చదువుకునే కసూరిబా పాఠశాలల్లో బోధన సక్రమంగా ఉండలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓతోపాటు, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఆత్మీయ సమావేశం ఏర్పాట్ల పరిశీలన..

కదిరి పట్టణంలో సమీపంలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 16న నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే కందికుంట పరిశీలించారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని, ఎటువంటి లోటు రాకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

‘ల్యాండ్ టైటిలింగ్’ రద్దుపై న్యాయవాదుల హర్షం


హిందూపురంలో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు


కృతజ్ఞత లేఖను పంపుతున్నట్లు చూపుతున్న మడకశిర న్యాయవాదులు

హిందూపురం, జూన్ 14: రైతులను నట్టేట ముంచేందుకు వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ దుర్మార్గమైందని, దానిని ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దుచేయడం ఎంతో అభినందనీయమని న్యాయవాదులు పేర్కొన్నారు. దాన్ని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టువద్ద న్యాయవాదులు మిఠాయిలు పంచుకున్నారు. అక్కడి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దుర్మార్గమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ యాక్ట్ అమలై ఉంటే పేదలెవరికి ఆస్తులుఉండేవికావన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పెత్తందారుల కోసం వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టమన్నారు. కానీ చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు బాధ్యతలు తీసుకున్న మొదటిరోజే ఈ చట్టం రద్దుపై సంతకం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కొన్ని నెలల క్రితం ఈ యాక్ట్‌పై పార్టీలకతీతంగా ఉద్యమించిందే న్యాయవాదులు కానీ అప్పట్లో దీనిపై ఎవరికీ ఏమీ తెలియదన్నారు. ఆ తరువాత అందరూ గమనించి జగన్ ప్రభుత్వానికి తగిన శాస్తి చేశారన్నారు. ఈ కార్యక్ర మంలో న్యాయవాదులు సుదర్శన్, రాజశేఖర్, సిద్దు, రామచంద్రారెడ్డి, రామచంద్ర, రవి, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేయడం అభినందనీయమని మడకశిర బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదులు శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో వారు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజులు, సీనియర్ న్యాయవాదులు నారాయణగౌడ్, గుండుమల రాధాకృష్ణ తదితరులు మాట్లాడుతూ... ప్రజల ఆస్తులకు భద్రత లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్టును గత ప్రభుత్వం తీ సుకొచ్చిందని, దానిని రద్దు చేయాలంటూ ఆ సమయంలో దాదాపు రెండు నెలలపాటు తాము నిరసన కార్యక్రమాలు చేపట్టినా స్పందించలేదన్నారు. అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబును కలిసి ఈ చట్టం వల్ల ప్రజలకు జరిగే నష్టాన్ని వివరించడంతో ఆయన సానుకూలంగా స్పందించి ఎన్నికల్లో హామీ ఇచ్చారని, అందుకు అనుగుణంగా రెండో సంతకంతోనే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ లేఖను పంపనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా న్యాయవాదులు లోకేష్, త్రిలోక్, హనుమంతరాయుడు, రఘునాథశాస్త్రి, కిష్టప్ప, గోపీనాథ్, విజయభాస్కర్, కృష్ణమూర్తి, నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

పెనుకొండ టౌన్, జూన్ 14 : పట్టణంలో ఈనెల 29వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర సేవాధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అనంతపురం ఉత్తర్వుల మేరకు జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తామని, కక్షిదారులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్, క్రిమినల్, ప్రీలిటికేషన్ తదితర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుకొండ టౌన్, జూన్ 14 : సోమందేపల్లి మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

‘బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి’


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాబీజాన్ సైదా

పెనుకొండ టౌన్, జూన్ 14: బక్రీద్ పండగను ఈనెల 16న జరిగే ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ బాబీజాన్‌సైదా పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో హిందువులు, ముస్లింలతో సమావేశం నిర్వహించారు. పెనుకొండకు ఓ చరిత్ర ఉందని హిందూ, ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని ఆయన కోరారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా కులపెద్దలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

మాంసం విక్రేతలకు సూచనలు


మాట్లాడుతున్న డీఎస్పీ కన్జక్షన్

హిందూపురం అర్బన్, జూన్ 14: టూటౌన్ పరిధిలోని మాంసం విక్రయదారులతో డీఎస్పీ కన్జక్షన్ శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. చట్ట ప్రకారం మాంసం వధించే విధానం పాటించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులను వధించే సమయంలో, మాంసం విక్రయించే సమయంలో పరదాలు ఏ ర్పాటు చేసుకోవాలన్నారు. దుర్వాసన రాకుండా నీటితో శుభ్రం చేసుకోవాలన్నారు. మునిసిపల్ శాఖ సూచనల మేరకు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ మహ్మద్ రియాజ్ ఉన్నాడు.

విత్తన కందులు తీసుకెళ్లండి: ఏఓ

గుడిబండ, జూన్ 14: ఖరీఫ్ సాగు కోసం మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీతో కంది విత్తనం పంపిణీ చేస్తున్నట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. ఆయన శుక్రవారం మండలకేంద్రంలో మాట్లాడుతూ.... మండలానికి 40క్వింటాళ్ల కందులు వచ్చినట్లు తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొని సంబంధిత ఆర్బీకేల నుంచి కందులను తీసుకెళ్లాలని సూచించారు.

అన్నదానం

పెనుకొండ, జూన్ 14: పట్టణంలోని సాయిరాం ఆసుపత్రిలో శుక్రవారం నారాయణసేవా కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి చికిత్సకు వచ్చిన రోగులకు సత్యసాయి సేవా సమితి సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన గర్భిణులు, రోగులు, వారి బంధువులు 130 మందికి పట్టణవాసి మారుతిప్రసాద్ భోజన సౌకర్యం కల్పించారు.

అనుమానాస్పద స్థితిలో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

హిందూపురం, జూన్ 14: తూమకుంట పారిశ్రామికవాడలోని రోలెవెల్ పరిశ్రమలో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ(43)అనే కాంట్రాక్ట్ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో గురువారం రాత్రి మృతిచెందినట్లు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. హిందూపురం మండలం చౌళూరుకు చెందిన లక్ష్మీనారాయణ అనే కాంట్రాక్ట్ కార్మికుడు గురువారం రాత్రి పరిశ్రమలో పనిచేయడానికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో మూత్రవిసర్జనకు బయటకు వచ్చాడు. అక్కడే కుప్పకూలి పడిపోయాడు. కొద్దిసేపటి తరువాత తోటి కార్మికులు గమనించారు. కానీ అప్పటికే అతడు మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య గంగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే భర్త అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంపై భార్యతో పాటు కుటుంబ సభ్యులు పరిశ్రమవద్ద ఆందోళన చేపట్టారు. కానీ మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. దీనిపై సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని తెలిపారు.

మహిళకు అస్వస్థత

గోరంట్ల, జూన్ 14: పట్టణానికి చెందిన లావణ్య అనే మహిళ ఒంటి నొప్పులు తగ్గాలని అధిక మోతాదులో మాత్రలు మింగి శుక్రవారం అస్వస్థతకు గురైంది. గోరంట్లలోని కదిరి రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద నివాసముంటున్న రవీంద్రారెడ్డి భార్య లావణ్య జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ ఓ ఆర్ఎంపీ వద్దలో పరీక్షలు చేయించుకుంది. అతడు రాసిచ్చిన మాత్రలు మిగింది. కొంత సేపటికి ఇంకా నయం కాలేదని మిగిలిన మాత్రలు మింగడతో అస్వస్తత పొందింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు అందించారు. ఆమె మానసిక స్థితి సరిగా లేకపోవడంతో అలా చేసిందని డాక్టర్ తెలిపారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


పరిగిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జూన్ 14: ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేయడం పట్ల నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పరిగి మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యంగా నిరుద్యోగ యువకులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం మాట నిలుబెట్టుకున్నారన్నారు. డీఎస్సీపై తొలి సంతకం చేయడంతో పాటు ల్యాండ్‌టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్నక్యాంటీన్‌ల పునరుద్ధరణ, స్కిల్ డెవలప్‌మెంట్‌పై సంతకం చేయడం హర్షణీయమన్నారు. చంద్రబాబు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఇక నుంచి రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారని, రాష్ట్రమంతా రామరాజ్యంగా మారిందని సంతోషం వ్యక్తం చేశారు.

గుండుమలను అభినందించిన ముఖ్యమంత్రి


గుండుమల తిప్పేస్వామిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మడకశిరటౌన్, జూన్ 14: మడకశిర అభ్యర్థి ఎంఎస్ రాజు గెలుపు కోసం కృషి చేసిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించినట్లు టీడీపీ స్థానిక నాయకులు తెలిపారు. గుండుమల శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కష్టపడి పనిచేసి తక్కువ సమయంలోనే ఎంఎస్ రాజును గెలిపించారని అందుకు ప్రత్యేకంగా అభినందించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. మడకశిర నియోజకవర్గం అభివృద్ధికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

బాగా చదివితే బంగారు భవిష్యత్తు


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మడకశిర రూరల్, జూన్ 14 : విద్యార్థులు బాగా చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని సర్పంచు గంగమ్మ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగరాజు పేర్కొన్నారు. మండలం లోని కల్లుమర్రి ఉన్న పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే విద్య, రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులకు కిట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతులపై కేసు నమోదు

ఉరవకొండ, జూన్ 14: మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ, ఆమె భర్త బసవరాజులపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సురేష్‌బాబు తెలిపారు. దౌర్జన్యంగా తమ ఇంటిని ధ్వంసం చేశారని రేణుక అనే మహిళ 2023 మేలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

గుంతకల్లుటౌన్, జూన్ 14: పట్టణంలోని సాయికృష్ణ నర్సింగ్ హోం వద్ద కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామానికి చెందిన శేకన్నపై శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు కట్టెలతో దాడి చేశారు. బాధితుడు, పోలీసులు తెలిపిన మేరకు పట్టణంలో శేకన్న చిన్న చిన్న పనులు చేసుకుని సాయికృష్ణనర్సింగ్ హోం వద్ద ఒక గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. సా యంత్రం ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి శేకన్నపై కట్టెలతో దాడి చేశారు. గాయపడిన అతన్ని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి ఘటనపై విచారణ చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

కూటమితోనే ప్రజాపాలన: బీజేపీ


అంబేడ్కర్ సర్కిల్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

హిందూపురం, జూన్ 14 : కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎన్‌డీఏ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. ఐదేళ్ల అరాచక పాలనకు రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. వారి అరాచకాలు, ప్రజావ్యతిరేక పాలన చూడలేక ప్రజలు కసిగా ఓడించారన్నారు. జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌కు మంత్రి పదవి దక్కడం అభినందనీ యమన్నారు. ప్రజలకు వందశాతం న్యాయం చేస్తారన్న నమ్మకం కలిగిందన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్‌లో కేక్‌కట్‌చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమర్‌దేవేంద్ర, అంజినరెడ్డి, కౌన్సిలర్ అంజలి, మారుతి, అంజినరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి


ఏపీఓ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

గోరంట్ల, జూన్ 14: మండలంలోని కమ్మల వాండ్లపల్లి, శీనప్పపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి పనుల పెండింగ్ బిల్లులు, ప్లేసి ప్పులు వెంటనే అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏపీఓ వరప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, నాయకులు స్వర్ణలత, ఆంజనేయులు, గౌనివారిపల్లి పంచాయతీ గ్రామాల్లో పర్యటించారు. ఉపాధి పనుల విషయంపై కూలీలతో మాట్లాడారు. చేసిన పనులకు ఎనిమిది వారాలుగా బిల్లులు చెల్లించలేదని, ప్లేసిప్పులు, పనిముట్లు ఇవ్వలేదని శీనప్పపల్లి, కమ్మల వాండ్లపల్లి కూలీలకు చెప్పినట్లు వారు తెలిపారు. మస్టర్లలో అదనపు పేర్లు చేర్చడం ద్వారా పనులు చేసిన కూలి తక్కువగా వస్తోందని ఆరోపించారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరిస్తామని ఏపీఓ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూన్ 14: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఐదు హామీల అమలుకు సంతకం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హోం మంత్రి వంగలపూడి అనితను టీడీపీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు గుండుమల తిప్పేస్వామి తో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు నవలావిష్కరణ సభ

అనంతపురం కల్చరల్, జూన్ 14 : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి రచించిన ఆకాశగానం నవలను ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో జిల్లా రచయితల సంఘం(జిరసం) ఆవిష్కరిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సభకు సాహితీకారులు, సాహిత్యాభిమానులు విరివిగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నసనకోటలో పట్టపగలే చోరీ

రామగిరి, జూన్ 14: మండలంలోని నసనకోట గ్రామంలో మాల రామాంజినేయులు ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఆయన ఇల్లు గ్రామ చివరన ఉంది. మధ్యాహ్నం ఆయన ఇంటికి తాళం వేసి వెళ్లిన సమయంలో.. గుర్తు తెలియని దొంగలు ఆ ఇంటి తాళం పగలకొట్టి.. బీరువాలో ఉన్న రూ.1.80 లక్ష, రెండు తులాల బంగార ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అనంతరం వచ్చిన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

‘అంగన్‌వాడీలతో చిన్నారులకు విద్య, ఆరోగ్యం’


కొడికొండలో ప్రచారం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చిలమత్తూరు, జూన్ 14: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల వరకు విద్య, ఆరోగ్యం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా శుక్రవారం ప్రీస్కూల్ పిల్లల తల్లులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొడికొండలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్య అందుతుందన్నారు. ఈ సందర్భంగా పిల్లల తల్లులతో మాట్లాడారు. మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలతో ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అలీముల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు శోభారాణి తదితరలు పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలోని ఫలారం గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్త మహదేవమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

టీడీపీ నాయకుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జూన్ 14 : ఎమ్మెల్యే సవితకు మంత్రి పదవిలో శాఖలు కేటాయించడంతో ఆమె నివాసంలో టీడీపీ నాయకులు, ఆమె కుటుంబ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సవితకు బీసీ సంక్షేమం హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖలు కేటాయించారు. దీంతో పట్టణంలోని తెలుగుతల్లి సర్కిల్‌లో ఉన్న ఆమె నివాసంలో కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ తదితర కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు మాట్లాడుతూ... ఐదేళ్ల వైసీపీ పాలనలో సవిత టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా నిలిచి, దీటుగా ఎదుర్కొన్నారన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఏది ఏమైనా ముఖ్యమంత్రి చంద్రబాబు సవితను గుర్తించి మంత్రి పదవి ఇవ్వడం పెనుకొండ వాసుల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో తురకలాపట్నం శ్రీనివాసులు, చంద్రకాంతమ్మ, అడ్వొకేట్ విశ్వనాథ్, జిల్లా అధికార ప్రతినిధి రఘువీరచౌదరి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం: నిమ్మల


శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప

గోరంట్ల, జూన్ 14: రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం కాపాడిన వారవుతారని మాజీ ఎంపీ ని మ్మల కిష్టప్ప పేర్కొన్నారు. గోరం ట్లకు చెందిన ది వాకర్, వార్డు మాజీ సభ్యుడు నాగరాజు, శివకుమార్ శుక్రవారం ప్రపంచ రక్తదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన నిమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉపాధి, ఉద్యోగావకాశాలను పెంపున కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టారన్నారు. మాజీ మంత్రి రామచంద్రారెడ్డి మాదిరిగానే ఆయన కుమార్తె సవిత మంత్రిగా మంచి పేరు తెచ్చుకుంటారని నిమ్మల అభిప్రాయపడ్డారు. శిబిరంలో 110మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, టీడీపీ నాయకులు నిమ్మల చంద్రశేఖర్, బాలక్రిష్ణ, నరేష్, సుబ్రహ్మణ్యం, కక్కుల రఘు, రామచంద్ర, జనసేన సంతోష్ తదితరులున్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ


బూదిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గోరంట్ల, జూన్ 14: మండలంలోని బూదిలి గ్రామంలో మలేరియా నిర్మూలనపై వైద్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శ్రుతి ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను జరిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సమతుల్యం కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. మలేరియా వ్యాధినివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ర్యాలీ అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సచివాలయం వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివన్న, సూపర్‌వైజర్ గంగాధర్, ఆరోగ్య విస్తరణాధికారి రమణ, వైద్య సిబ్బంది విజయభాస్కర్, అరుణమ్మ, ప్రశాంతి, దివ్య, ప్రత్యూష, శ్రావణి, రమ్య, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

నల్లచెరువు, జూన్ 14: మండలంలోని తలమర్ల వాండ్లపల్లి పంచాయతీ సున్నపుపల్లివాండ్లపల్లిలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన నారాయణప్ప ఆవును తన బోరు బావి వద్ద మేత కోసం వదిలాడు. ఆవు విద్యుత్ మేత మేస్తుండగా అక్కడే ఉన్న స్తంభా నికి సమీపంలోకి వెళ్లింది. స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురై మృతిచెందింది. స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతోందని సంబంధితాధికారులకు పలుమార్లు తెలిపానని, ఎవరూ పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. ఆవు మృతితో దాదాపు రూ.70వేలు నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

వ్యక్తిపై కేసు నమోదు

పుట్లూరు, జూన్14: మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన మిద్దెల చిన్న సిద్ధయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన మహిళలపై అసభ్యంగా ప్రవర్తించాడనే ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. గ్రామంలో ఇష్టానుసారంగా మాట్లాడినట్లు తెలిపారు. జయలలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

కురుబ ప్రజాప్రతినిధులకు సన్మానం

అనంతపురం ప్రెస్‌క్లబ్ : రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన కురుబ ప్రజాప్రతి నిధులు మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, తెలంగాణ చీఫ్ విప్ బీర్ల ఐలయ్యను కురబ సంఘం ఆధ్వ ర్యంలో ఈ నెలాఖరులో సన్మానం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తుప్పటి ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జూదరుల అరెస్టు

గార్లదిన్నె, జూన్ 14 : మండలంలోని యర్రగుంట్ల గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం ఐదుగురు పేకాట రాయిళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 7500 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆరు ఇసుక టిప్పర్లు సీజ్

శింగనమల : స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో వెళ్లి మండలంలోని ఉల్లికల్లు ప్రాంతాం నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు టిప్పర్లను శుక్రవారం తెల్లవారుజామున సీజ్ చేశారు. వాటిని స్టేషన్‌కు తరలించారు.

చేగువేరాకు ఘన నివాళి

అనంతపురం సెంట్రల్ : విప్లవ కెరటం చేగువేరా జయంతి సందర్భంగా స్థానిక ఏఐఎస్ఏ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి శుక్రవారం పలువురు నివాళి లర్పించారు. ఇందులో ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వలి, నాయకులు పరశురాముడు, బాలకృష్ణ, మురళీ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో హుండీ చోరీ

ధర్మవరంరూరల్, జూన్ 14: కనగానపల్లి మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి షిర్డీసాయిబాబా ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ చోరీ చేసి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న ఈ సాయిబాబా ఆలయంలోకి రాత్రి వేళలో ఆ దుండగులు చొరబడి ఆలయం తలుపులు పగలగొట్టి హుండీ ఎత్తుకెళ్లారు. దాన్ని గ్రామశివార్లలోకి ఎత్తుకెళ్లి హుండీ తాళం పగలగొట్టి అందులో ఉన్న సుమారు 10 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా ఈ చోరీపై గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.